ఏదీ.. ! ఆడబిడ్డ నిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు మహిళలందరికీ ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసి ప్రతి మహిళకు నెలకు రూ.1,500 నేరుగా ఖాతాలో జమచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రతి బహిరంగ సభలో హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మి చాలామంది అక్కచెల్లెమ్మలు ఓటేశారు. అయితే ఏం లాభం ? కూటమి ప్రభుత్వం 17 నెలలు కావొస్తున్నా.. ఆడబిడ్డ నిధి పథకం అమలుపై మంత్రివర్గ భేటీలో ఇంతరవకు ఒక్కసారి కూడా చర్చకు రాలేదు. అంటే ఈ పథకం కూడా గాలిలో కలిపేసినట్లేనా అని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- 17 నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోని ఆడబిడ్డ నిధి పథకం
- ప్రతి నెలా రూ.1,500 చొప్పున అందిస్తామని మోసం
- ఇప్పటికే ఒక్కో మహిళకు రూ.25 వేల బకాయి
- పూతలపట్టు నియోజకవర్గంలో 83,686 మంది ఎదురుచూపు



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఆడబిడ్డ నిధి హామీ లోగో

ఐరాల: ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఎన్నికల హామీలను తుంగలో తొక్కి పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. అంతేగాకుండా సంక్షేమ పథకాల అమలులో కూడా తూతూమంత్రంగా అమలు చేసి అనుకూల మీడియాలో ఆహా ఓహో బ్రహ్మాండం రాయించుకోవడంలో ఆయనకు మించిన సిద్ధహస్తుడు మరెవరూ ఉండరు.
ప్రభుత్వ తీరు చూస్తే ఆడబిడ్డ నిధిని గంగలో కలిసినట్టే అని నియోజకవర్గ మహిళలు అభిప్రాయపడుతున్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేశారు. ఇంకెవరైనా అమలు చేయలేదంటే వారి నాలుక మందమే అని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ సభలో పలికిన మాటలివి. తీరా చూస్తే మసిపూసి మారెడు కాయ చేసి ఇచ్చాం అన్నట్లుగా ఉంది కూటమి ప్రభుత్వం తీరు. కుట్రలో భాగంగా పీ–4 పథకంలోకి ఆడబిడ్డ నిధిని తోసేసి ఇచ్చాం అన్నట్లు కవర్ చేసి చంద్రబాబు మహిళలకు శఠగోపం పెట్టేశారు.

గతంలో మహిళల జీవనోపాధికి అండగా..
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళల జీవనోపాధికి పెద్దపీట వేశారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత లాంటి అనేక ముఖ్యమైన పథకాలన్నింటినీ నేరుగా మహిళల వ్యక్తిగత ఖాతాలోకి జమ చేసి వారి ఆర్థికాభివృద్ధికి అండగా నిలిచింది. మహిళల చేతికి చేరిన నగదు వృథా కాకుండా ఇంటి అవసరాలకే ఉపయోగపడుతుందని భావించి అనేక పథకాల డబ్బును మహిళల ఖాతాకే జమ చేశారు.

రూ.200 కోట్ల బకాయిలు
నియోజకవర్గంలో 1,12,815 లక్షల మంది మహిళలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 60 ఏళ్లు పైబడిన వారిని మినహాయిస్తే 2024 అక్టోబర్ నాటి లెక్కల ప్రకారం 59 ఏళ్లలోపు వారు 88,686 మంది మిగులుతారు. వీరికి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.1,500 చొప్పున చెల్లిస్తే నెలకు రూ.133,029,000 చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలలకు రూ.2,261,493,000 చెల్లించాల్సి ఉంది. ఈ నగదు ఎప్పుడు చెల్లిస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఈ మొత్తాన్ని ఒకే విడతలో చెల్లించడంతో పాటు రాబోయే రోజుల్లో నెలనెలా రూ.1,500 చెల్లించాలని మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆడబిడ్డ నిధి ఎప్పుడు?



కూటమి ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న ఆడబిడ్డ నిధి ఎప్పుడు ఇస్తారో వెంటనే చెప్పాలి. హామీ ఇచ్చి రెండేళ్లు కావొస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని అమలు చేయాలి. దీంతో పాటు 17 నెలల బకాయిలు కూడా వెంటనే చెల్లించాలి. హామీలు విస్మరించి మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోంది.
- ప్రియ, పుల్లూరు, ఐరాల

మోసం చేయడం తగదు



అధికారంలోకి రాక ముందు ఒకలా వచ్చాక మరోలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మహిళలను మోసం చేయడం తగదు. వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతాం. ఎన్నికల సమయంలో కూటమి నేతలు 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చారు. ఇప్పటి వరకు ఆ దిశగా ఆలోచించకపోవడం దుర్మార్గం.
- చంద్రిక, చిన్నవెంకటంపల్లె, ఐరాల

చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి..



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు మాయమాటలతో మభ్యపెట్టి ఇప్పుడు వంచనకు గురిచేసింది. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయకపోవడం మహిళలను మోసం చేయడమే. కూటమి నేతలు మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారే గానీ పథకాల గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పథకం అమలు చేసి మహిళల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.
- రూప, చిన్నవెంకటంపల్లె, ఐరాల

క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ వైస్‌చైర్మన్

యాదమరి : మండల పరిధిలోని నూరేనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నయీంబాషా కుమార్తె వివాహానికి వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ బి.ధనుంజయరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూరేనగర్‌కు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారు పార్టీ ముఖ్య నేతలతో కాసేపు చర్చించారు. ఎంపీపీ సురేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోనాపల్లి మనోహర్, నేతలు కార్తీక్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు మెరుగుపరచాలి


హాస్టల్‌ను సందర్శిస్తున్న మెప్మా డైరెక్టర్ రవీంద్ర

గంగవరం: హాస్టల్లో శానిటేషన్ పనులు మెరుగ్గా చేయాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ రవీంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. పలమనేరు పట్టణంలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లను గురువారం ఆయన తనిఖీ చేశారు. హాస్టళ్లలో శానిటేషన్ సమస్యలను గుర్తించిన ఆయన శానిటేషన్ మెరుగుపరిచి శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.
అనంతరం ఎద్దుల సంత వీధిలోని నీటి సరఫరా పంప్ హౌస్‌ను పరిశీలించి తరచూ క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. అనంతరం మెప్మా కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మెప్మా పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

26న కార్తీక వనభోజనాలు

పుంగనూరు: పట్టణంలోని హరిహర బ్రాహ్మణ యువజన సక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న కార్తీక వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు సంఘ నాయకులు ఫణిభాస్కర్, రాజేష్ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిఏటా నిర్వహించే రీతిలో కార్తీక మాస పూజలు నిర్వహించి, 26న గూడూరుపల్లెలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, వన భోజనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సురేంద్రబాబు, మహేష్ కుమార్, పార్థసారథి, వినోద్ పాల్గొన్నారు.

మొక్కలతోనే మనుగడ


మాట్లాడుతున్న సీఈఓ రామారావు

ఐరాల: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, పరిశుభ్రత, పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం చెట్లు ముఖ్యమని చిత్తూరు రియల్ గ్రామీణ విద్య, స్వేచ్ఛ ఎన్జీఓ సీఈఓ రామారావు అన్నారు. గురువారం మండలంలోని నాగంవాండ్లపల్లెలో రైతులకు మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతు మొక్కలు నాటాలన్నారు. తమ ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో రైతులకు విరివిగా మొక్కలు పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టామన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కోరారు. ఈనాటి మొక్కలే రేపటి వృక్షాలన్నారు. తొలుతగా ఎన్జీఓ ఆధ్వర్యంలో నిర్మించిన బీరప్పచెరువు చెక్‌డ్యాం, చెరువు కట్టను పరిశీలించారు. అనంతరం రైతులకు 5100 మామిడి మొక్కలు, 1400 టెంకాయ మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలు అందుకున్న రైతులు ఎన్జీఓ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ హనీషా, మండల క్లస్టర్ కో–ఆర్డినేటర్ కుసుమ, ఎన్జీఓ మండల వాలంటీర్లు రాజేష్, కిషోర్, సునీత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఓ బోలేరా వాహనం ఢీకొని ఇద్దరు ద్విచక్రవాహనదారులు గాయాలపాలయ్యారు. ఈ ఘటన గురువారం రాత్రి చిత్తూరు మండలం తాళంబేడు క్రాస్‌లో చోటు చేసుకుంది. బీఎస్‌ఆర్‌పేట పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు నుంచి బీఎస్‌ఆర్‌పేట వైపు వస్తున్న గ్రావిటా ఫ్యాక్టరీ బొలేరో వాహనం..ఎదురుగా వస్తున్న ఇద్దరు ద్విచక్రవాహనదారులను ఢీకొట్టింది. దీంతో తాళంబేడు క్రాస్‌కు చెందిన సెల్వం తీవ్రంగా గాయపడగా.. బీఎన్ కండ్రిగకు చెందిన సతీష్‌కు తేలికపాటి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, గ్రామస్తులు కలిసి తీవ్రంగా గాయపడిన సెల్వంను చికిత్స నిమిత్తం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

నీవానది ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం


నీవానది వద్ద ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని నీవా నది పరివాహక ప్రాంతాల్లోని ఇళ్లల్లో వరదనీళ్లు రాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను త్వరలోనే కల్పిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం చిత్తూరు మేయర్ అముద, ఎమ్మెల్యే జగన్‌మోహన్ నాయుడితో కలిసి కలెక్టర్, ఇతర అధికారులు నీవానది పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. వీరభద్రకాలనీ, తేనెబండ ప్రాంతాల్లో స్థానిక ప్రజలతో మాట్లాడి వాళ్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంతపేటలోని లిల్లీ బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న ప్రాంతాలను సైతం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంలో చాలావరకు చెరువులు నిండిపోయి వాగులు పొంగుతుండడం వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తాయన్నారు. లిల్లీ బ్రిడ్జిని ప్రమాదకరంగా ఉందని, దీనిస్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ఈ ప్రతిపాదనలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు మాట్లాడుతూ నీవానది పరివాహక ప్రజల కోసం రూ.175 కోట్ల ప్రతిపానదలతో వంతెనలు, కల్వర్టర్లు, రీటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదించామని, ప్రస్తుతం ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైలుకు త్వరలోనే ఆమోదం లభిస్తుందన్నారు. బియ్యం, పప్పులు, ఉప్పు, కూరగాయలు, దుప్పటితో కూడిన బ్యాగులను దాదాపు 500 కుటుంబాలకు అందించారు. కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజు పాల్గొన్నారు.

హొయల జిల్లేడుబుగ్గ..

చుట్టూ అడవులు.. పచ్చని చెట్లు.. ఎత్తయిన కొండలు ప్రకృతి అందాలకు నెలవైన జిల్లేడుబుగ్గ జలపాతం అందాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. జలపాతం హొయలు, పక్షుల కిలకిల రావాలు, పచ్చదనం అందాలు ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రానికి 8 కి.మీ. దూరంలో ఐరాల, సోమల మండలాల సరిహద్దుల్లో 181 ఉప్పరపల్లె అటవీ ప్రాంతంలో ఈ రమణీయమైన జలపాతం ఉంది. కొండలపై నుంచి నీరు జాలువారుతోంది. ఈ జలపాతం తిలకించేందుకు స్థానికులే కాకుండా ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. స్నానాలు చేస్తూ కేరింతలు కొడుతున్నారు. సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపేస్తున్నారు. - ఐరాల



కరెంటు కోతల కట్టడికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్(కాణిపాకం): పల్లెల్లో కరెంటు కోతలపై విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సాక్షి దినపత్రికలో గత రెండు రోజులుగా బీఎస్‌ఆర్‌పేట, తాళంబేడు సబ్‌స్టేషన్ పరిధిలో కరెంటు కోతలపై ‘నిత్యం కోతలే’, మ్యాన్ పవర్ కొరత అనే పేరిట కథనాలు వచ్చాయి. వీటిపై విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. ఇన్సిలేటర్లు, కరెంటు తీగలను అవసరం మేరకు అందజేశారు. గురువారం 50 కరెంటు స్తంభాల్లో పగిలిన ఇన్సిలేటర్లను మార్పు చేశారు. మరో 10 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు, కరెంటు కోతలకు ఆటంకం ఉన్న వాటిని సరిచేసి కోతలు లేకుండా చూస్తున్నామని శాఖ అధికారులు తెలిపారు.


విద్యుత్ అధికారులు అందించిన ఇన్సిలేటర్లు


ఇన్సిలేటర్లు మారుస్తున్న సిబ్బంది

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

యాదమరి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీహెచ్ఓ శ్రీనివాసమూర్తి అన్నారు. గురువారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు 400 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పిల్లలకు ఎత్తు, బరువు, వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం




ఐరాలలో కురుస్తున్న వర్షం , మొరవ పారుతున్న చుక్కావారిపల్లె చెరువు

ఐరాల: మండల వ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన మోస్తరు వర్షం గురువారం కురిసింది. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని చెక్‌డ్యాంలు, కుంటలు, వాగులన్నీ జలకళను సంతరించుకున్నాయి. వాగులు, కుంటలు, చెక్‌డ్యాంల్లోకి వర్షపు నీరు చేరడంతో పంటల సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షం మెట్ట పైర్లకు బాగా ఉపయోగ పడుతుందంటున్నారు. అలాగే భూగర్భ జలాలు పెరిగి తాగునీటికి కూడా సమస్య ఉండదని ప్రజలు సంతోష పడుతున్నారు. ఇలాగే మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే చెరువుల్లోకి కూడా పూర్తిస్థాయిలో నీళ్లు చేరి వ్యవసాయానికి అనువుగా ఉంటుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని అతి పెద్ద చెరువైన చుక్కావారిపల్లె చెరువు మొరవ సాగుతుంది.